క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



విద్యార్థులతో బాలాజీ ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : బాలాజీ ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించింది. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గల వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కార్యాలయానికి బీరువా, పుస్తకాల ర్యాక్ అందజేసింది. అలాగే వీసీసీ జగదాంబ జోన్ పరిధిలో పరీక్షలు రాస్తున్న 40 మంది విద్యార్థులకు ఎగ్జామినేషన్ కిట్లు అందజేసింది. కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. కామేశ్వరరావు, కార్యదర్శి కె. సత్యనారాయణ, కోశాధికారి మల్లికార్జునరావు, రోటరీక్లబ్ ఆఫ్ వైజాగ్ డైమండ్స్ ప్రతినిధులు ఆర్. నీరజ, కెప్టెన్ కాశీ ప్రసాద్, కె. నగేష్‌కుమార్ మాట్లాడుతూ చదువుతో పాటు సామాజిక స్పృహ కూడా ఉండాలని, చదువుకునే వయసులో చదువుపై దృష్టి పెట్టాలని అదే భవిష్యత్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీసీసీ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె. రమాప్రభ, ఇంటరాక్ట్ డిస్ట్రిక్ట్ రిప్రజెంటేటివ్ జాహ్నవి, నరేష్, కె. సుశీల, అఖిల్ పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభం



పిల్లలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్న టీచర్ రమాప్రియ

దాబాగార్డెన్స్ : పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో వేసవి శిబిరంలో భాగంగా ఆదివారం ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరం ప్రారంభించారు. ప్రతి ఆదివారం నిర్వహించనున్న ఉచిత కంప్యూటర్ శిక్షణలో పాల్గొనదలిచే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. కంప్యూటర్ శిక్షణ తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్న టీచర్ ఎస్ఎస్ రమాప్రియను సంస్థ అధ్యక్షుడు ఈ సందర్భంగా అభినందించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

సీతంపేట: వాసవీ వాల్తేర్ కపుల్స్ ఆధ్వర్యంలో శంకరమఠం రోడ్డులోని వీ డెంటల్ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథి వాసవీ క్లబ్ కేబినెట్ సెక్రటరీ బి.ఎస్.వి.కమలశ్రీ శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 100 మందికి పైగా యువకులు, మహిళలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అమ్మ బ్లడ్ బ్యాంకు సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించారు. దాతలకు క్లబ్ ప్రెసిడెంట్ పి.వినోద్‌కుమార్, ట్రెజరర్ కె.రామకృష్ణ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ కె.వి.గురుమూర్తి, జి.అనిల్‌కుమార్, వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ ధ్రువపత్రాలు అందజేశారు. వైద్యులు వై.శ్వేత, ఇ.శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

నేడు నూకాంబికకు జలాభిషేకం

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు బర్మా క్యాంప్ జైభారత్‌నగర్‌లో వెలసిన నూకాంబికా అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు సోమవారం ప్రారంభమవుతాయని ఆలయ ఈవో తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 6 నుంచి 11 గంటల వరకు మహిళలు బిందెలతో పవిత్ర జలాలను తీసుకొచ్చి హరిద్ర జలాభిషేకం, అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహిస్తారు.

తపోదీక్ష.. నియమాలే రక్ష

- మాలధారణలో దీక్షాపరులు
- గుడ్‌ఫ్రైడేతో ముగింపు



దీక్షా మాలలు వేస్తున్న ఫాదర్ వేళంగిణిరాజు



సెయింట్ పీటర్ చర్చిలో దీక్షాధారులకు మాలలు వేస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్

కంచరపాలెం : మానసిక ప్రశాంతత, పాపపరిహారార్థం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో తపోదీక్షలు చేస్తారు. 46 రోజుల పాటు సాగే ఈ దీక్ష మార్చి 29న జరిగే గుడ్‌ఫ్రైడేతో ముగుస్తుంది. ఏసు సువార్త పరిచర్య ప్రారంభించడానికి ముందు 40 రోజులు జెరూసలేంలోని ఎడారి ప్రాంతంలో ఉపవాస దీక్షలు చేపట్టారు. అనంతరం దీనులను ఆదుకున్నారు. ఏసు చేసిన ఉపవాస దీక్షలను తపోకాల దీక్షలుగా పిలుస్తారని జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్రం, సెయింట్ పీటర్స్ పునీత పేతురు రాయప్ప ప్రధాన దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు.

రక్షణగిరిలో తపోదీక్షలు..

ఆది కాలంలో అనేక మంది రాజులు, ప్రవక్తలు, ప్రజలు పాప పరిహారంగా శరీరమంతా బూడిద పూసుకుని గోనెబట్ట ధరించి ఉపవాసంతో 40 రోజులు తపస్సు చేసినట్లు పవిత్ర బైబిల్ ధ్రువీకరిస్తోంది. 2003లో రక్షణగిరి తపోదీక్షలు ప్రారంభించి సంఘపరంగా నిర్దిష్ట నియమాలు ప్రవేశపెట్టారు. పూర్వం ఎవరికి వారే ఈ దీక్షలు పాటించేవారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది సంఘటితంగా దీక్షలు స్వీకరిస్తున్నారు. ప్పట్లో 150 మందితో దీక్షలు ప్రాంభించారు. ఏడాది పలు చర్చిల్లో సుమారు 8 వేల మందికి పైగా దేవుని సేవలో ఉన్నారని ఫాదర్ జాన్ ప్రకాష్ తెలిపారు.

నిష్ఠతో దీక్షలో పాల్గొనాలి..

తపోదీక్షలో స్త్రీలు, పురుషులు జపమాల ధరించవచ్చు. నిత్యం దివ్యపూజలో పాల్గొనాలి. సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానం చేసి తెల్లని వస్త్రాలు, నీలి వస్త్రాలు ధరించాలి. మద్యం, మాంసాహారం విడిచి సన్మార్గంలో పయనించాలి.

తపోకాలంలో పాటించాల్సిన నియమాలు

- సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానం చేసి తెల్లని వస్త్రాలు, నీలి వస్త్రాలు ధరించాలి. శిలువ మార్గం, దివ్య బలిపూజ తపోదీక్ష ప్రార్థన చేయాలి.
- తపోదీక్షలో జపమాల ధరించి ఉపవాసం చేయాలి.
- కొంత మొత్తాన్ని పేదలకు దానం ఇవ్వాలి.
- జూదం, ధూమపానం, మద్యపానం, మాంసాహారం వదిలేయాలి.
- ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి.
- ఘర్షణలకు దూరంగా ఉండి, మిత్రభావాన్ని పెంపొందింపజేయాలి.

సేవ చేసే భాగ్యం కలుగుతుంది..



46 రోజుల ఉపవాస దీక్షలో పేద, గొప్ప అనే తారతమ్యం లేకుండా అందరికీ సేవ చేసే భాగ్యం కలుగుతుంది. అందరినీ ప్రేమించగలిగే మంచి మనస్తత్వం అలవడుతుంది.

– బూరెల రామ్ కిషోర్, దీక్షాపరుడు, జ్ఞానాపురం

సన్మార్గానికి దిక్సూచి..



తపోదీక్షల వల్ల శాంతి పొందుతారు. వ్యసనాలు మానేస్తారు. తోటి వారితో ప్రేమపూర్వకంగా మెలుగుతారు. కఠినత్వం స్థానే సున్నితత్వం అలవడుతుంది. అందరికీ సేవ చేసే గుణం పెంపొందుతుంది.

– రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, జ్ఞానాపురం

శాంతిని పొందుతున్నా..



దీక్షాకాలంలో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తోంది. ప్రార్థన వల్ల ప్రశాంతత లభించి జీవితంలో గందరగోళ పరిస్థితుల నుండి బయటపడతాం.

– గిడుతూరు రాయుడు, దీక్షాపరుడు, కంచరపాలెం

జ్ఞానవరం లభిస్తుంది..



తపోదీక్ష స్వీకరించిన వారు అనేక జ్ఞానవరాలు పొందుతారు. నైతిక బాధ్యతలు అలవరచుకుంటారు. భక్తిశ్రద్ధలతో తపోదీక్షలు ఆచరించడం వల్ల దయామయులుగా మారుతారు.

– ఆకుల రత్నకుమారి, టీచర్, జ్ఞానాపురం

మరింత సంక్షేమానికి జగనే మళ్లీ సీఎం కావాలి



39వ వార్డు ప్రజలను కలిసిన ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు కావాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం 39వ వార్డు ముస్లిం, మత్స్యకార పెద్దలతో జరిగిన ఆత్మీయ కలయికలో మాట్లాడారు. దక్షిణ నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతగానో సహకారం అందజేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో దాదాపు 25 వేలకు పైగా పక్కా గృహాలు అందజేశామన్నారు. విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తున్న వైఎస్సార్‌సీపీ మళ్లీ గెలిపిస్తే ప్రజలకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. పెద్దలు మాట్లాడుతూ వాసుపల్లిని హ్యాట్రిక్ ఎమ్మెల్యే చేస్తామని ముక్తకంఠంతో చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి మరో 20 ఏళ్లు సీఎంగా వుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 39వ వార్డు పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయికలో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

ప్రభుత్వ గిరిజన పాఠశాలకు చైతన్య స్రవంతి చేయూత



చేయూతనందిస్తున్న డాక్టర్ షిరీన్ రెహ్మాన్

దాబాగార్డెన్స్ : ప్రభుత్వ గిరిజన పాఠశాల అభివృద్ధికి చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు ఆదివారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహ్మాన్ మాట్లాడుతూ గిరిజన యువకుడు లకే సూరిబాబు గీతం యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి డీఎడ్ శిక్షణ పొందారని చెప్పారు. సూరిబాబుది జి.మాడుగుల మండలంలోని ఎం. సంగం సొంత గ్రామమని, 2006లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారని చెప్పారు. స్కూల్లో పిల్లల కోసం ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, అక్కడి విద్యార్థుల సంఖ్య 10 నుంచి 36కి చేర్చారన్నారు. ఇక్కడ తొలుత రేకుల షెడ్డు మాత్రమే ఉండేదని, బెంచీలు తక్కువగా ఉన్నాయని తెలుసుకున్నాక, అమెరికాలో ఉన్న స్నేహితులు స్పందించి చేయూతనిచ్చారని సూరిబాబు తెలిపారన్నారు. భావరాజు సర్వేశ్వరరావు, వెంకటరత్నం ట్రస్ట్ అందజేసిన అవార్డు కింద ఇచ్చిన రూ.50 వేలకు మరో రూ.15 వేలు మొత్తంగా రూ.65 వేలతో 13 బెంచీల కొనుగోలుకు సూరిబాబుకు చైతన్య స్రవంతి ద్వారా అందజేసినట్లు అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహ్మాన్ అందజేశారు. యూఎస్ఏలో ఉన్న తనయుడు సమీర్ సిఫారసుపై ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె పేర్కొన్నారు. ప్రొఫెసర్ బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ చైతన్య స్రవంతి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. గిరిజన ప్రాంతంలోని ప్రాథమిక పాఠశాలకు విరాళం ప్రకటించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చైతన్య స్రవంతి సభ్యులు విజయ, రుకియభాను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటూ కట్టుకథలు

కార్పొరేటర్ మేరీజోన్స్ ఆగ్రహం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు ఇసుకకొండ సత్యనారాయణస్వామి ఆలయ స్థలంలో అనుమానాస్పద కట్టడం నిర్మిస్తున్నారని, ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నా దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండతో ఆ కట్టడాన్ని నిర్మిస్తున్నారని పచ్చమీడియా ఆరోపిస్తూ రాత రాసింది.

ఫ్యాక్ట్ ఇదీ..

వార్డు పరిధి సత్యనారాయణస్వామి ఆలయం వెనుక భాగంలో నివసిస్తున్న 4 వేల మంది దళితుల కోసం సుమారు రూ. 20 లక్షల జీవీఎంసీ నిధులతో సామాజిక భవనం నిర్మిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ 11న అప్పటి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు సజావుగా సాగాయి. బిల్లులు పెండింగ్ కారణంతో పది రోజుల కిందట కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. బిల్లులు మంజూరు కావడంతో తిరిగి పనులు ప్రారంభించారు. ఈ విషయాన్ని పచ్చమీడియా తప్పుడు రాతలు రాస్తూ స్థానికంగా నివసిస్తున్న దళితుల అభివృద్ధిని అడ్డుకుంటోందని వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ 'సాక్షి'కి తెలిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఫాల్గుణ మాస శుద్ధ చతుర్దశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 దర్శనాలు కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ లండ రమణ, సిబ్బంది, కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

'భీమిలి టికెట్ పంచకర్ల సందీప్‌కే ఇవ్వాలి'

దాబాగార్డెన్స్: భీమిలి అసెంబ్లీ టికెట్ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్‌కే ఇవ్వాలని జనసైనికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జనసేన విశాఖ జిల్లా రూరల్ ప్రధాన కార్యదర్శి వీవీ కృష్ణయ్య, జనసేన జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రజల సేవలో ఉన్న పంచకర్ల సందీప్‌కి భీమిలి టికెట్ ఇవ్వాలన్నారు. భీమిలిలో మెగా ఫ్యామిలీ అభిమానులే ఎక్కువ మంది ఉన్నారని, విద్యావంతుడు, యువకుడు సందీప్‌కి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో భీమిలి నియోజకవర్గం 9 వార్డుల అధ్యక్షులు, 3 మండలాల అధ్యక్షులు, ముఖ్యనాయకులు, శాఖరి శ్రీనివాస్, మజ్జి సూరిబాబు, శ్రీనుబాబు, శ్రీకాంత్, తమ్మిన అప్పలరాజు, కురిమిన రామస్వామినాయుడు, పోతిన అనురాధ, నాగోతినాయుడు, వీరమహిళలు పాల్గొన్నారు.

పోలీస్ బైక్ ప్రారంభం

సీతమ్మధార: ఎన్నికల నేపథ్యంలో నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు 30 ద్విచక్ర వాహనాలు (బైక్) పంపించారు. ఈ మేరకు ఆదివారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బైక్‌ను సీఐ ఎస్.విజయకుమార్ ప్రారంభించారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అల్లర్లు జరగకుండా చర్యలు చేపట్టేందుకు ఒక కానిస్టేబుల్ ఈ వాహనం ద్వారా పర్యవేక్షిస్తుంటారు. ట్రాఫిక్‌లో వెళ్తున్నప్పుడు కీప్ లెఫ్ట్ అని ఈ బైక్ డిజిటల్ బోర్డుపై స్క్రోలింగ్ అవుతుంది. ప్రథమ చికిత్స కోసం ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంటుంది.

ఘనంగా మట్టల ఆదివారం



శ్లీవ్ గుర్తు వీధిలో మట్టలకు ప్రార్థన చేస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్



జ్ఞానాపురం వీధుల్లో మట్టలతో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ నేతృత్వంలో (మ్రాదికొమ్మల) మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలతో జ్ఞానాపురం వీధుల్లో ప్రార్థనలు చేశారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ మాట్లాడుతూ క్రీస్తు ప్రభువుకు జెరూసలేం పట్టణంలోకి వచ్చే సమయంలో నాటి ప్రజలు మ్రానుకొమ్మలతో స్వాగతం పలికినట్లు చెప్పారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి తపస్సు కాలంలో మ్రానుకొమ్మల ఆదివారం నిర్వహిస్తారన్నారు. క్రీస్తు శాంతి సమాధానానికి మూల పురుషుడని, ఏసు ప్రభువు అందరికీ దేవుడన్నారు. పరిశుద్ధ వారం ప్రాముఖ్యతను వివరించారు. సహాయ విచారణకర్తలు బైబిల్ చదివారు. ఈస్టర్ వరకు ప్రతి ఒక్కరూ ప్రతి రోజు చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పాదర్లు వేళంగిణిరాజు, ప్రభాకర్, పీపీసీ సభ్యులు శ్రీముసురు రాజేష్, పాలమరశెట్టి ఫ్రాన్సిస్, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి వ్యవస్థలే ముఖ్యం



మాట్లాడుతున్న ఆచార్య ప్రసన్నకుమార్

సీతంపేట: ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి వ్యవస్థలు సక్రమంగా పని చేయాలని సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ అన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖ పబ్లిక్ లైబ్రరీ సంయుక్తంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయశంకర్ రచించిన గ్రంథం 'వై భారత్ మేటర్స్'పై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తులు మారినా సంస్థలు శాశ్వతంగా నిలిచి ఉంటాయన్నారు. న్యాయవాది ఎం.రామదాస్ మాట్లాడుతూ జయశంకర్ రచించిన పుస్తకంలోని ముఖ్య అంశాలను సమీక్షించారు. భారతదేశం ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా ఎదగడానికి తగిన వనరులున్నాయని, వ్యవస్థల మధ్య సమన్వయంతో పాలన సాగాలన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ నెహ్రూ, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, నరేంద్రమోదీ విధానాలను వివరించారు. మోదీ రాముడిని ఒక గొప్ప నాయకుడిగా చూపిస్తున్నారని, భారతీయ సంస్కృతి వైశిష్ట్యాన్ని లోకానికి చాట డానికి ప్రాధాన్యమిస్తున్నారని చెబుతూ, రామాయణంలోని మానవీయ కోణాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, రచయిత డి.వి.సూర్యారావు, వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

బ్రిడ్జి బ్యూటిఫుల్

- కంచరపాలెం నేతాజీ వంతెనకు మహర్దశ
- శిథిలావస్థ నుంచి సుందరీకరణ దిశగా..
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్లైఓవర్ అభివృద్ధి



వంతెనపై ప్లాంటేషన్



విరిగిన ఫుట్‌పాత్



టైల్స్‌తో అందంగా కనిపిస్తున్న ఫుట్‌పాత్



కళతప్పిన నేతాజీ ఫ్లైఓవర్ బ్రిడ్జి



సుందరంగా కంచరపాలెం నేతాజీ వంతెన

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో కంచరపాలెం నేతాజీ వంతెనకు మహర్దశ పట్టింది. ఈ ఫ్లైఓవర్ బ్రిడ్జిని అభివృద్ధి చేయడంతో పాదచారులు, వాహన చోదకులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. కంచరపాలెం మెట్టు కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వరకు గల రహదారుల అభివృద్ధికి జీవీఎంసీ రూ.1.65 కోట్ల నిధులు మంజూరు చేసింది. నేతాజీ వంతెనకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా ఈ మార్గంలో బీటీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, పూలకుండీలు ఏర్పాటు చేసి, బ్రిడ్జి గోడలకు ఆకర్షణీయమైన రంగులు వేసి చక్కగా తీర్చిదిద్దారు. పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌లపై టైల్స్, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేశారు. ఆహ్లాదకర వాతావరణం కంటికి కనిపించేలా వంతెనను బ్యూటిఫుల్‌గా ఆధునికీకరించారు.

నాడు కళావిహీనం..

గత ప్రభుత్వంలో నేతాజీ వంతెన కళావిహీనంగా ఉండేది. దీని పరిస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కంచరపాలెం ప్రధాన కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గాల్లో విద్యుత్ లైట్లు వెలగక చిమ్మచీకట్లు కమ్ముకునేవి. వంతెనపై విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి నేలకొరిగాయి. ఫుట్‌పాత్‌లపై పాదచారుల రాకపోకలకు ఇబ్బందికరంగా పడి ఉండేవి. రాత్రి వేళ చీకట్లలో వాహన చోదకులు ఇబ్బందులు పడేవారు. సాయంత్రం అయ్యేసరికి వంతెన మార్గం అంధకారంతో నిండి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారేది. ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళా వాకర్స్ ఇబ్బందులు పడేవారు.

నేడు సుందరీకరణ : వైఎస్సార్‌సీపీ దక్షిణ, ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు వాసుపల్లి గణేష్‌కుమార్, కె.కె.రాజు, ఆదారి ఆనంద్‌కుమార్‌ల కృషితో నేతాజీ వంతెన అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. జీవీఎంసీ జోన్-5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌లు నిర్మించి సిమెంట్ పలకలు, టైల్స్ వేశారు. తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. వాటికి లైట్లు అమర్చడంతో వంతెనపై వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఫ్లైఓవర్‌పై కొత్త హంగులు, ప్లాంటేషన్ పనులు పూర్తి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నడవాలంటే భయమేసేది



గతంలో కంచరపాలెం నేతాజీ వంతెనపై నడవాలంటేనే ఇబ్బందికరంగా, రాత్రి వేళ భయంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధితో వంతెన సమస్యకు మోక్షం లభించింది. వంతెనను పచ్చదనంతో నింపారు. వాహన చోదకులు, పాదచారులు సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారు.

– గిడుతూరి రాణి, జ్ఞానాపురం

సాఫీగా రాకపోకలు



కొత్త రోడ్లు, ఫుట్‌పాత్‌లు, విద్యుత్ లైట్లు, రంగులతో నేతాజీ ఫ్లైఓవర్ కళకళలాడుతోంది. వాహన చోదకులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెనను అభివృద్ధి చేశారు.

– పాత్రపిల్లి సునీల్‌కుమార్, కంచరపాలెం